సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 1 । జూన్ । 2023



క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఐటీడీఏ ఏపీఓ(జనరల్) డేవిడ్‌రాజ్ అన్నారు. 8లో



తవ్వినకొద్దీ అక్రమాలు

ఇల్లెందు జేకే ఓసీ భూసేకరణలో నిర్వాసితుల జాబితా పెరుగుతోంది. ఇక్కడ ఆదిలోనే పలు అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం

40° / 27°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రత అధికంగానే ఉంటుంది. రాత్రి వరకూ వేడి వాతావరణం, ఉక్కపోతతో ఇబ్బందులు తప్పవు.

న్యూస్‌రీల్

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుకను బుధవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రేపు ప్రత్యేక పూజలు..

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రామాలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఈఓ రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరంగిక పూజలతో పాటు సుదర్శన హోమం, సువర్ణ పుష్పార్చన జరపనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ఈ పూజల్లో పాల్గొనాలని కోరారు.

12న యూనిఫాం పంపిణీ



యూనిఫాంను పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరురూరల్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈనెల 12న యూనిఫాం పంపిణీ చేయనున్నట్లు విద్యాశాఖ జిల్లా కో ఆర్డినేటర్లు ఎస్‌కే సైదులు, నాగ రాజశేఖర్ తెలిపారు. మణుగూరులో యూనిఫాం సిద్ధం చేస్తున్న టైలరింగ్ సెంటర్లను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 8వ తేదీ లోపే యూనిఫాం పాఠశాలలకు చేర్చాలని సూచించారు. 12న విద్యార్థులకు అందజేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠ్యపుస్తకాలు సైతం విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే పంపిణీ చేయాలన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం చేపట్టి విద్యార్థుల నమోదును పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా శిబిరం



టీ షర్టులు పంపిణీ చేస్తున్న అధికారులు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 4 నుంచి నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా సింగరేణి ఏరియా జీఎం షాలేమురాజు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులతో పాటు క్రీడాకారులందరికీ టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, అధికారులు శ్రీహరి, సాయి స్వరూప్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కొత్తగూడెంటౌన్: మే 28 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో జరిగిన సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. ఖోఖోలో జిల్లా జట్టు తృతీయస్థానంలో నిలవగా కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందించి అభినందించారు. అథ్లెటిక్స్ 100, 400 మీటర్ల విభాగంలో కాంస్య పతకం, పురుషుల లాంగ్‌జంప్‌లో రజత, మహిళల షాట్‌పుట్‌లో స్వర్ణ పతకం సాధించారని జిల్లా పాఠశాలల నిర్వహణ కార్యదర్శి స్టెల్లా తెలిపారు. కాగా, వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన వారితో పాటు కోచ్‌లు, మేనేజర్లను కలెక్టర్ అనుదీప్, యువజన క్రీడల శాఖ అధికారి టి. సీతారాం, డీఈఓ సోమశేఖరశర్మ, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి అభినందించారు.

ప్రజల పండుగకు సర్వం సిద్ధం

దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం

- బోడు పట్టాలతో గిరిజనుల జీవితాల్లో వెలుగులు
- జిల్లాలో రికార్డు స్థాయిలో ఆయిల్‌పామ్ సాగు
- మారుమూలలకూ చేరువవుతున్న వైద్య సేవలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ అనుదీప్





విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న ఐడీఓసీ కార్యాలయం (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పల్లె – పట్నం, కులం – మతం, పేద – ధనిక, ఉద్యోగులు – అధికారులు, ప్రతిపక్షం – అధికారపక్షం అనే తేడా లేకుండా జిల్లా ప్రజలంతా ఘనంగా నిర్వహించే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశామని కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ తెలిపారు. జూన్ 2 నుంచి 22 వరకు జిల్లా వ్యాప్తంగా ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా పండుగ వాతావరణం నెలకొనబోతోందని చెప్పారు. గత పదేళ్లుగా తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఓసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ శ్రమించడం వల్లే తక్కువ కాలంలోనే వెనుకబడిన భద్రాద్రి వంటి జిల్లా సైతం ప్రగతి పట్టాలపై పయనం మొదలెట్టాయన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

రాష్ట్రంలోనే అడవులు ఎక్కువగా ఉన్న జిల్లా భద్రాద్రి కొత్తగూడెం. దీనికి తగ్గట్టే తొలి దశలో గిరిజనులకు పట్టాలు అందివ్వబోతున్న పోడు భూములు సగం ఇక్కడే ఉన్నాయి. 50 వేల కుటుంబాలకు సుమారు లక్షన్నర ఎకరాల పోడు భూమిపై యాజమాన్య హక్కును కల్పించబోతున్నాం. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే వారికి రైతుబంధు సాయం అందనుంది. ఒక్క కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు లక్షల మందికి పైగా అంటే జనాభాలో నాలుగో వంతు మంది జీవితాల్లో వెలుగురేఖలు పరుచుకోనున్నాయి.

1200 కుటుంబాలకు అసైన్డ్ పట్టాలు..

జిల్లాలో చాలా కాలంగా అసైన్డ్ పట్టాల పంపిణీ ఆగిపోయింది. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా 1200 కుటుంబాలకు అసైన్డ్ భూములకు పట్టాలు జారీ చేయబోతున్నాం. ఇందులో అశ్వాపురం మండలం తుమ్మలచెరువు, మామిళ్లవాయిలలో 300 ఎకరాలకు పైగా భూములకు పట్టాలు జారీ చేయబోతున్నాం. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఏడాది రైతుబంధు ద్వారా సగటున రూ.200 కోట్ల సాయం అందుతుంటే తాజాగా జారీ చేసే అసైన్డ్, పోడు పట్టాలతో ఈ మొత్తం దాదాపు రూ.350 కోట్లకు చేరనుంది. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి వీరంతా ఎలాంటి భయాలు లేకుండా సాగు చేసుకోవచ్చు. రైతుబంధు, రైతు బీమా ఇలా అన్ని రకాల సౌకర్యాలకూ అర్హులు కాబోతున్నారు.

పామాయిల్‌లో దూసుకుపోతున్నాం..

పామాయిల్ సాగుకు జిల్లాలో పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ఇప్పటికే 33 వేల ఎకరాల్లో ఈ పంట విజయవంతంగా సాగవుతోంది. ఈ ఏడాది 16వేల ఎకరాల్లో కొత్తగా సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించగా మనం 17వేల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయించాం. ఈ ఏడాది అదనంగా మరో 20 వేల ఎకరాల్లో ఈ పంట సాగు చేసేలా ప్రణాళిక అమలు చేయబోతున్నాం.

వైద్య సేవల్లో కొత్త శకం..

భద్రాద్రి జిల్లా ఏర్పడిన తర్వాత వైద్యరంగంలో చాలా మెరుగుపడింది. జిల్లా కేంద్రంలో మెడికల్, నర్సింగ్ కాలేజీలు, వాటికి అనుబంధంగా 350 పడకల సర్వజన ఆస్పత్రి, మాతాశిశు ఆస్పత్రి అందుబాటులోకి వచ్చాయి. ఇల్లెందు, మణుగూరు, బూర్గంపాడులో వైద్య సేవలు మెరుగయ్యాయి. సీటీస్కాన్ మొదలు డయాలసిస్ సెంటర్ల వరకు సరికొత్త సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలో మారుమూలన ఉన్న అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో కొత్తగా డాక్టర్లను నియమించాం, సౌకర్యాలు మెరుగుపరిచాం. వైద్య సేవలు, కాన్పుల కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా అక్కడ ఒక్కో పని చేసుకుంటూ పోతున్నాం. చర్ల ఆస్పత్రిలోనూ సరికొత్త సేవలు, సదుపాయాలు కల్పిస్తున్నాం. ఆ తర్వాత గుండాలపై దృష్టి సారిస్తాం. అక్కడున్న ఆస్పత్రిని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదన ఉంది. దీంతో జిల్లా నలుమూలలా వైద్య సేవల్లో కొత్తశకం ప్రారంభం కానుంది.

ఇల్లెందులో ఇండస్ట్రీస్

బీటీపీఎస్ వంటి భారీ పరిశ్రమతో పాటు ఐటీసీ పేపర్ మిల్స్ – భద్రాచలం ఆధారంగా చిన్న తరహా పరిశ్రమలు బూర్గంపాడు మండలంలో వచ్చాయి. రాబోయే రోజుల్లో మరిన్ని చిన్న, మధ్య తరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు వీలుగా ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల ఏర్పాటుకు ప్రణాళిక రెడీ అయింది. ముందుగా ఇల్లెందు మండలంలో సుమారు 200 ఎకరాల్లో ఇది ఏర్పాటు కానుంది. ఆ తర్వాత ఇతర నియోజకవర్గాలకూ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు వస్తాయి. ఇవి అందుబాటులోకి వస్తే పామాయిల్, మక్క, చిరు ధాన్యాలు, మిర్చి రైతులకు ఉపయోకరగంగా ఉంటుంది. స్థానికులకూ ఉపాధి లభిస్తుంది.

పట్టా పక్కాగా..

ప్రస్తుతం చెలామణిలో ఉన్న రెవెన్యూ పట్టాలతో పోల్చితే పోడు పట్టాలు మరింత సమగ్రంగా రూపొందించాం. పట్టాదారుడి పేరు, ఫొటో, కుటుంబ సభ్యుల వివరాలు, యజమానితో వారికున్న బంధుత్వం, జెండర్, కులం, పట్టా జారీ చేస్తున్న పోడు భూమికి సంబంధించి అక్షాంశాలు, రేఖాంశాలతో కూడిన జియోట్యాగింగ్ వివరాలు, ఆ భూమికి సంబంధించిన సరిహద్దులు తదితర అన్ని వివరాలతో కూడిన మ్యాప్ కూడా పట్టా పుస్తకంలో జత చేస్తున్నాం. లోపాలు లేకుండా పోడు పట్టాలు జారీ చేసేందుకు 2022 నవంబర్ నుంచి మార్చి వరకు విస్తృతంగా పని చేశాం. జిల్లా వ్యాప్తంగా 726 బృందాలు ఈ పనిలో రేయింబవళ్లు పాల్గొన్నాయి.

డీడీఎన్ @ రూ.10 వేలు

- ధూపదీప నైవేద్య పథకం వేతనం పెంపు
- ఉమ్మడి జిల్లాలో 98 ఆలయాలు కొత్తగా స్కీంలోకి..
- అర్చకుల్లో హర్షాతిరేకాలు

కొత్తగూడెంటౌన్ : ఆదాయం తక్కువగా ఉన్న ఆలయాల నిర్వహణకు ధూపదీప నైవేద్యం పథకం కింద ఇస్తున్న వేతనం, పడితరం ఖర్చులను రూ.10 వేలకు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ బుధవారం ప్రకటించగా.. ఉమ్మడి జిల్లాలోని 319 ఆలయాలకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో 238 ఆలయాలకు, భద్రాద్రి జిల్లాలో 81 ఆలయాలకు నెలకు అర్చకుడి వేతనం రూ.4వేలు, ఇతర ఖర్చులకు రూ.2వేలు మొత్తం రూ.6వేల చొప్పున ఆలయ ఖాతాల్లో జమయ్యేవి. అయితే ఈ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. అంతేకాక ఖమ్మం జిల్లాలో కొత్తగా 63 ఆలయాలు, భద్రాద్రి జిల్లాలో 35 ఆలయాలను ఈ పథకం కింద చేర్చనున్నట్లు తెలిసింది. వీటికి కూడా పథకం వర్తిస్తే ఉమ్మడి జిల్లాలో ఆలయాల సంఖ్య 417కు పెరగనుందని ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన తెలిపారు.

2007లో ప్రారంభం

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదాయం తక్కువగా ఉన్న ఆలయాలు జీర్ణావస్థకు చేరగా, 2007లో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ఆలయాలపై దృష్టి సారించారు. ఆలయాలు మూతబడవద్దనే ఉద్దేశంతో అర్చకుల వేతనం రూ.2000, ఇతర ఖర్చులు రూ.500 కలిపి రూ.2500 ఆలయ ఖాతాల్లో జమయ్యేలా చూశారు. 2014లో తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఈ మొత్తాన్ని రూ.6 వేలకు పెంచారు. అయితే ప్రస్తుతం పెరిగిన ధరలతో రూ.6వేలు సరిపోవడం లేదంటూ అర్చకులు కొంత కాలంగా ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు వారి వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతూ సీఎం నిర్ణయించడంతో వారిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇక వేద పండితులు, శాస్త్ర పండితులకు చెల్లించే గౌరవ వేతనాన్ని కూడా రూ.2500 నుంచి రూ. 5,000కు పెంచారని, ఈ భృతి పొందే వయసును 75 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు తగ్గించారని ఏసీ వివరించారు.

3న రైతు వేదికల్లో వేడుకలు

ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

కొత్తగూడెంరూరల్ : రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3న జిల్లాలోని 67 రైతు వేదికల్లో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఇందుకోసం ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగులో రైతు వేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏర్పాట్ల ప్రక్రియను వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పర్యవేక్షించాలన్నారు. అన్ని క్లస్టర్లలో ఆయా గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించాలని, జాతీయ గీతాలాపనతో వేడుకలు ప్రారంభించాలని చెప్పారు. వేదికలను మామిడి తోరణాలు, పూలు, విద్యుత్‌లైట్లతో అలంకరించాలని సూచించారు. వ్యవసాయరంగంలో సాధించిన విజయాలను తెలిపేలా ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో పండగ వాతావరణం ఉట్టిపడేలా చూడాలని, ప్రజాప్రతినిధులు, ప్రజలను వేడుకల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. కార్యక్రమం అనంతరం రైతులందరికీ సామూహిక భోజనాలు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఏఓ అభిమన్యుడు, ఉద్యాన అధికారి జినుగు మరియన్న పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథి రేగా..

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా కేంద్రంలో ఈనెల 2న నిర్వహించే దశాబ్ది వేడుకలకు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు గ్రామ, మండల, డివిజన్, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని అన్నారు. ఐడీఓసీ కార్యాలయం వెలుపల ఉన్న కార్యాలయాల అధికారులు 8.30 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరించి, ఆ తర్వాత ప్రగతి మైదానంలో అమరవీరులకు నివాళులర్పించే కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లను విద్యుత్‌దీపాలతో అలంకరించాలని చెప్పారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ విద్యార్థులకు గురువారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్‌లో చేరేందుకు మే 10 నుంచి అడ్మిషన్లు మొదలయ్యాయి. ఇప్పటికే అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ప్రథమ సంవత్సర క్లాసులు, మొదటి సంవత్సరం ఉత్తీర్ణులైన ద్వితీయ సంవత్సరం తరగతులు నేడు ప్రారంభించనున్నారు. ఇందుకు కోసం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు సిద్ధం చేశారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై కౌన్సిలర్ భర్త దౌర్జన్యం

ఇల్లెందు: ట్రేడ్ లైసెన్స్ జారీ వివాదంలో ఓ కౌన్సిలర్ భర్త మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై దౌర్జన్యానికి దిగిన ఘటన ఇల్లెందులో బుధవారం జరిగింది. బాధితుడు బండ్ల రాధాకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు పట్టణంలోని ఐదో వార్డు కౌన్సిలర్ యలమందల వీణ భర్త, మాజీ కౌన్సిలర్ యలమందల వాసు పి.కళావతి అనే మహిళతో ట్రేడ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేయించారు. అయితే ఈ ఏడాది మేలో బాధ్యతలు చేపట్టిన రాధాకృష్ణ ఈ నెలకు సంబంధించిన లైసెన్స్ జారీ చేశారు. కాగా, 2020 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు లైసెన్స్ ఇవ్వాలని వాసు కోరగా, తాను విధుల్లో లేని కాలంలో ఇవ్వడం సాధ్యం కాదని రాధాకృష్ణ చెప్పారు. ఇలా పలు దఫాలు రాధాకృష్ణ చుట్టూ తిరిగిన వాసు.. బుధవారం మున్సిపల్ సమావేశం జరుగుతుండగా వెళ్లి గట్టిగా నిలదీశారు. దీంతో ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగింది. ఆగ్రహం పట్టలేని వాసు.. నీ అంతు చూస్తానంటూ బూతుపురాణానికి దిగాడు. దీంతో తనను అకారణంగా దూషిస్తున్నారంటూ రాధాకృష్ణ కన్నీటిపర్యంతమయ్యారు. కాగా, ఆయనను పక్కనున్న కౌన్సిలర్లు, అధికారులు సముదాయించారు. ఈ ఘటనపై మున్సిపల్ కమిషనర్ అంకుషావలికి రాధాకృష్ణ ఫిర్యాదు చేశారు.



రోదిస్తున్న రాధాకృష్ణ


వరుస ఘటనల్లో బీఆర్‌ఎస్ నేతలు

ఇల్లెందులో కొందరు అధికార పార్టీ నేతల వైఖరితో బీఆర్‌ఎస్ అప్రతిష్ట పాలవుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఒకటో వార్డు కౌన్సిలర్ వారా రవి ప్రభుత్వ భూమిలో ఉన్న పురాతన బావిని పూడ్చివేసి, స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకోవడం చర్చనీయాంశమైంది. 20 రోజుల క్రితం బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు, సింగరేణి ఉద్యోగి నాదెళ్ల శ్రీనివాసరెడ్డి ఓ అధికారిపై చేయి చేసుకున్న ఘటన సంచలనంగా మారింది. అయితే ఇంతవరకూ ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం తగదు

డీఎంహెచ్ఓ శిరీష

కరకగూడెం/మణుగూరురూరల్ : బాధితులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష స్పష్టం చేశారు. కరకగూడెం, మణుగూరు మండలాల్లో బుధవారం ఆమె పర్యటించారు. కరకగూడెంలో పలు క్లినిక్‌లు, ల్యాబ్‌లను తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రెండు క్లినిక్‌లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే చేయాలని, అవసరమైన వారి రక్త నమూనాలు సేకరించాలని సూచించారు. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. తమ వద్దకు వచ్చే పేషెంట్లను పీహెచ్‌సీకి రిఫర్ చేయాలని చెప్పారు. పీహెచ్‌సీలో సమయపాలన పాటించడం లేదని కొందరు ఆమె దృష్టికి తేగా మెరుగైన సేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మణుగూరు పీహెచ్‌సీలో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షలు చేయించుకున్న పలువురికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మణుగూరు, కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారులు శివకుమార్, కారం మధు, కంటివెలుగు ప్రోగ్రామ్ అధికారి పర్శియా నాయక్, క్యాంప్ వైద్యాధికారి ఉమాదేవి, అసిస్టెంట్ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు, నిశాంత్‌రావు, లింగ్యానాయక్, కృష్ణ, నర్సింహా, ఏఎన్‌ఎంలు పద్మ, రమాదేవి పాల్గొన్నారు.



కరకగూడెంలో డ్రైయినేజీని పరిశీలిస్తున్న శిరీష

ఏజెన్సీ డీఈఓ ఏమాయె ?

- జిల్లాల పునర్విభజనతో ఆ పోస్టు మాయం
- ఇన్‌చార్జ్‌లతోనే నడుస్తున్న గిరిజన, ఆశ్రమ పాఠశాలలు
- సరైన పర్యవేక్షణ లేక తగ్గుతున్న ఫలితాలు
- ఈ ఏడాదైనా నియమించాలని పలువురి వేడుకోలు

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఫలితాలు తగ్గుతున్న వేళ ఏజెన్సీ డీఈఓ పోస్టు మళ్లీ చర్చకు వచ్చింది. నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉన్న భద్రాచలం ఐటీడీఏలో గిరిజన విద్య పటిష్టత కోసం గతంలో ఉన్న కీలక పోస్టును మళ్లీ భర్తీ చేయాలని, లేదా గిరిజన సంక్షేమ శాఖ ఆధీనంలో నూతన పోస్టు ఏర్పాటు చేయాలని గిరిజన, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరంలోనే ఆ పోస్టు భర్తీ చేయాలని కోరుతున్నాయి.

2016లో డీఈఓగా అప్‌గ్రేడ్..

గతంలో ఐటీడీఏ పరిధిలో ఏజెన్సీ ఇన్‌చార్జ్ డీఈఓగా రవీందర్‌బాబు ఉండేవారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు, గిరిజన గురుకులాలు ఆయన పరిధిలో పనిచేసేవి. 2016లో జిల్లాల పునర్విభజన సమయంలో ఏజెన్సీ డీఈఓ పోస్టును జిల్లా విద్యాశాఖ అధికారిగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి డీఈఓ పరిధిలోనే అన్ని విద్యాసంస్థలు పనిచేస్తున్నాయి.

2016 నుంచి ఇన్‌చార్జ్‌లే దిక్కు..

జిల్లాల పునర్విభజన సందర్భంగా 2016లో ఏజెన్సీ డీఈఓ పోస్టు మాయమైంది. అనంతరం ఇన్‌చార్జ్‌ల పాలనలోనే గురుకులాలు, ఆశ్రమాలు నడుస్తున్నాయి. గిరిజన గురుకులాల ఇన్‌చార్జ్‌గా ఉన్న ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్‌కు ఆర్‌సీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆశ్రమ పాఠశాల పర్యవేక్షణను ఐటీడీఏ డీడీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. మొన్నటి వరకు డీడీగా పనిచేసిన రమాదేవి పర్యవేక్షించగా, ఆమె ఇటీవల బదిలీపై వెళ్లారు. దీంతో ఆశ్రమ పాఠశాలల నిర్వహణను సైతం ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్‌కే అప్పగించారు. దీంతో ఆయన కీలకమైన మూడు బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది.

పూర్తిస్థాయి అధికారి అవసరం..

జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలను భద్రాచలం, దమ్మపేట, ఇల్లెందు డివిజన్లుగా విభజించారు. ప్రస్తుతం ఐటీడీఏ పరిధిలో 50 ఆశ్రమ పాఠశాలలు, 3 బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు ఉండగా, గిరిజన గురుకులాలు భద్రాద్రి జిల్లాలో 21, ఖమ్మం జిల్లాలో 6 ఉన్నాయి. ఇన్ని గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణకు పూర్తిస్థాయిలో ఏజెన్సీ డీఈఓ ఉండాలనే డిమాండ్ ఎంతోకాలంగా వినిపిస్తోంది. ఇన్‌చార్జ్‌లు పని భారంతో సక్రమంగా పర్యవేక్షించలేకపోతున్నారని, దీంతో ఫలితాలపై ప్రభావం పడుతోందని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. గిరిజన విద్యా వ్యవస్థలో కీలకమైన ఏజెన్సీ డీఈఓ పోస్టును తక్షణమే భర్తీ చేయాలని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.



భద్రాచలం ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు (ఫైల్)

పర్యవేక్షణ లేక.. ఫలితాలు రాక..

గిరిజన విద్యను పటిష్ట పరుస్తామని, 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తామని ఐటీడీఏ అధికారులు ప్రతీ సంవత్సరం ప్రకటిస్తున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదని ఫలితాలు నిరూపిస్తున్నాయి. ఈ ఏడాది గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మొత్తం 2,139 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,607(75.13 శాతం) మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. గణితంలో 337 మంది, సైన్స్‌లో 210, సోషల్‌లో 153 మంది, మాతృభాషైన తెలుగులో 68 మంది ఫెయిలయ్యారు. కొన్ని ఆశ్రమ పాఠశాలల్లో అధిక సంఖ్యలో గణితంలో ఫెయిల్ కావడం గమనార్హం. పెదమిడిసిలేరు ఆశ్రమ పాఠశాలలో 55 మంది పరీక్షలు రాయగా 34 మంది, అన్నపురెడ్డిపల్లి హాస్టల్‌లో 25కు 21 మంది గణితంలో ఫెయిలయ్యారు. సెల్ఫ్ సెంటర్ ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో అత్యధిక ఫలితాలు రాగా, ఇతర కేంద్రాల్లో పరీక్షలు రాసిన విద్యార్థుల్లో మాత్రం గణనీయంగా పడిపోయాయి.

తక్షణమే భర్తీ చేయాలి



గిరిజన విద్యాభివృద్ధిలో కీలకమైన ఏజెన్సీ డీఈఓ పోస్టును వెంటనే భర్తీ చేయాలి. ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పోస్టు భర్తీకి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి. ప్రాథమిక విద్య పునాదికి బాటలు వేయాలి.

– బి రాజు, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ప్రతిపాదన ఉంది



ఐటీడీఏలో ఏజెన్సీ డీఈఓ పోస్టు అవసరం ఉంది. దీనికి సంబంధించి ప్రపోజల్ సైతం రూపొందించాం. ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు సూచన మేరకు నివేదికను గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌కు పంపించాం.

– డేవిడ్‌రాజ్, ఐటీడీఏ ఏపీఓ జనరల్

క్లుప్తంగా

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి


ఆర్చరీ శిక్షణ పొందిన విద్యార్థులతో ఏపీఓ, అధికారులు

పాల్వంచరూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఐటీడీఏ ఏపీఓ(జనరల్), ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజు సూచించారు. మండలంలోని కిన్నెరసాని గిరిజన క్రీడాపాఠశాల్లో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా హాజరైన డీడీ మాట్లాడుతూ వేసవి శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు నిరంతరం సాధన చేయడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఉద్బోధించారు. విద్యార్థులకు క్రీడాదుస్తులు, షూస్ అందించడమే కాక భోజన వసతి కల్పించి ఆర్చరీ, అథ్లెటిక్స్, వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, బాక్సింగ్, రెజ్లింగ్, హాకీలో కూడా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చందు, ఏటీడీఓ నర్సింహారావు, స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ వీరూనాయక్‌తో పాటు బుగ్గ వెంకటేశ్వర్లు, మోతీలాల్, హరికృష్ణ, వెంకన్న, అన్నం వెంకటేశ్వర్లు, భద్రు, నాగరాజు, శ్రీనివాసరావు, నాగప్రత్యూష, దివ్య, కృష్ణకుమారి, బాపనమ్మ, రవీందర్, నిఖిల్, వెంకట్ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీ


స్కానింగ్ సెంటర్లలో తనిఖీలకు వచ్చిన సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లోని పలు ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో బుధవారం వైద్యాధికారులు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, ఎఫ్-ఫరమ్స్‌ను ఆడిట్ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎండీ.ఫయాజ్‌మోహిద్దీన్, నాగలక్ష్మి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


13న పామాయిల్ రైతు సదస్సు

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 13న అశ్వారావుపేటలో రాష్ట్రస్థాయి పామాయిల్ రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏఐకేఎస్ అనుబంధ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయిల్‌ఫెడ్ జోన్‌లో ప్రైవేటు కంపెనీల పరిశ్రమల ఏర్పాటుతో ఆయిల్‌ఫెడ్ ఉనికి ప్రమాదంలో పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రైవేట్ కంపెనీలను నిరోధించేందుకు రైతులు ముందుకు రావాలని పేర్కొన్నారు. సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.

13 కేజీల గంజాయి పట్టివేత

భద్రాచలం అర్బన్: భద్రాచలంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం 13 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బెల్లం సత్యనారాయణ, ఎస్సైలు తిరుపతి, శ్రీకాంత్ పట్టణంలోని ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో రెండు బైక్‌లను ఆపి తనిఖీ చేయగా 13 కిలోల గంజాయి లభ్యమైంది. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో సీలేరు వద్ద గంజాయిని కొనుగోలు చేసి భద్రాచలం మీదుగా హైదరాబాద్ తరలిస్తున్నట్లు తేలింది. హైదరాబాద్‌కు చెందిన అభిలాష్, సతీష్ మూడు కేజీలతో పట్టుబడగా, మరో ఘటనలో శ్రీకాంత్ రెడ్డి, నిఖిల్ 10 కేజీలతో పట్టుబడ్డారు. ఈ వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్న మరో ఆరుగురు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2,60,000 ఉంటుందని అంచనా. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు టౌన్ సీఐ నాగరాజు తెలిపారు.

తునికాకు బస్తాలకు మావోయిస్టుల నిప్పు


బారేగావ్ గోడౌన్‌లో మావోయిస్టులు దగ్ధం చేసిన తునికాకు కట్టలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో మావోయిస్టులు తునికాకు బస్తాలను దగ్ధం చేశారు. కాంకేర్ జిల్లాలోని బారేగావ్ పోలీస్ స్టేషన్‌కు సమారు 100 మీటర్ల దూరంలో తునికాకు గోడౌన్ ఉండగా, ఇటీవల ఆయా ప్రాంతాల్లో సేకరించిన తునికాకు బస్తాలను గోడౌన్ బయట నిల్వ చేశారు. మంగళవారం అర్ధరాత్రి గోడన్‌లోకి ప్రవేశించిన మావోయిస్టులు బయట ఉన్న 150 తునికాకు బస్తాలకు నిప్పంటించగా, పూర్తిగా కాలిపోయాయి. ఆ తర్వాత ఇదే జిల్లాలోని బద్గావ్‌లో కూడా కళ్లంలో ఉన్న తునికాకు కట్టలకు నిప్పంటించగా అవి స్వల్పంగా దగ్ధమయ్యాయి.

తవ్వినకొద్దీ వెలుగులోకి అక్రమాలు

- ఎంజాయ్‌మెంట్ సర్వే నుంచే అంకురార్పణ
- జాబితాలోకి ఇబ్బడిముబ్బడిగా కొత్త పేర్లు
- గ్రామసభ ఆమోదం అసంపూర్ణమేనా ?

ఇల్లెందురూరల్: జేకే ఓసీ పనులు ప్రారంభమైతే అందులో బొగ్గు నిక్షేపాలు ఎంత మేర బయటపడుతాయో కానీ.. ఓసీ అనుమతుల కోసం సింగరేణి చేసిన తొలి ప్రయత్నంలోనే అక్రమాలు ఇబ్బడిముబ్బడిగా వెలుగులోకి వస్తున్నాయి. నిన్నటి వరకు భూమి క్రయవిక్రయాలతో రైతుల జాబితా పెరిగిందని భావించినప్పటికీ ఈ ప్రక్రియలో బాధ్యులు, పెద్దల లాభాపేక్ష లక్ష్యంగా ఎంజాయ్‌మెంట్ సర్వే నుంచే అక్రమాలకు అంకురార్పణ జరిగినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు వాస్తవాలు ఇలా ఉన్నాయి..

అసలైన నిర్వాసితులు 55 మందే..

జేకే ఓసీ భూసేకరణలో భాగంగా మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ సమీపంలో అటవీశాఖ పరిధిలోని సర్వే నంబర్ 549లో 261.33 హెక్టార్ల భూభాగం సింగరేణికి అవసరమైంది. ఇందులో అప్పటికే కొందరు రైతులు సాగు చేసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. సర్వే ఆధారంగా నిర్వాసిత భూభాగం 154 హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో వాస్తవంగా సాగులో ఉన్న రైతులు 52 మంది కాగా.. ఓ గిరిజనేతరుడి నుంచి జరిగిన క్రయ విక్రయాల కారణంగా జాబితాలో కొత్తగా మరో 36 పేర్లు కలిశాయి. దీంతో జాబితా 88కి చేరింది. అయితే 2021 జూలై 31 నాటికి 107గా నమోదైంది. అది కాస్త ఆర్‌వోఎఫ్‌ఆర్ గ్రామ సభ నాటికి 114కు చేరుకుంది. 88 మంది నుంచి 114కు జాబితా పెరగడానికి కారణాలు విశ్లేషిస్తే అనేక అక్రమాలు వెలుగుచూస్తున్నాయి.


ఎంజాయ్‌మెంట్ సర్వే అనంతరం అధికారులు రూపొందించిన నిర్వాసిత ప్రాంత మ్యాప్

ఎంజాయ్‌మెంట్ సర్వేలోనే..

సింగరేణి, రెవెన్యూ, అటవీశాఖల అధికారులు జేకే ఓసీ నిర్వాసిత భూభాగాన్ని గుర్తించిన తర్వాత అందులో సాగు చేసుకుంటున్న రైతుల వివరాలు సేకరించేందుకు ఎంజాయ్‌మెంట్ సర్వే చేపట్టారు. ఇక్కడే అక్రమాలు మొదలయ్యాయి. అప్పటికే 18 ఎకరాలు కొనుగోలు చేసిన దళారీ ఆ సంఖ్యను 36కు చేర్చడంతో అదే తరహాలో మరికొంత కొత్తగా ఎవరికీ అనుమానం రాకుండా అక్రమాలకు బాటలు వేశారనే ఆరోపణలు ఉన్నాయి. సర్వేకు ముందే ఒప్పందం కుదుర్చుకున్న పెద్దలు, బాధ్యులు అనర్హులైన రైతుల పేర్లను జాబితాలోకి చేర్చినట్లు అర్థమవుతోంది. నిర్వాసిత ప్రాంతంగా నిర్దేశించిన ప్రదేశంలో ఖాళీగా ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని తాము ఒప్పందం చేసుకున్న రైతుల పేర్లను జాబితాలో పొందుపర్చారు. అంతేకాక మరో గిరిజనేతరుడి నుంచి జరిగిన భూ కొనుగోళ్లపై దృష్టిసారించిన పెద్దలు.. అందులో ఎనిమిది పేర్లను, గతంలో పేర్కొన్న విధంగా 36 మంది జాబితాలో ఇద్దరి పేర్లను తొలగించి తమ అనుకున్న వారి పేర్లను పొందుపర్చారు. ఇంతేకాకుండా ఎంజాయ్‌మెంట్ జాబితాలో ట్రాక్ నెంబర్ 50 నుంచి 67 వరకు పరిశీలిస్తే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. ఇలా జాబితాలో అనేక అక్రమాలకు బాటలు వేసినప్పటికీ ఒప్పందం చేసుకున్న వారి పేర్లు మిగిలి ఉండటంతో కొత్తగా మరో 15 పేర్లను జాబితాలో చేర్చాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

గ్రామసభ ఆమోదం పొందినట్లా.. లేదా ?

ఈనెల 24న సింగరేణి వైసీవోఏ క్లబ్‌లో ఆర్డీఓ స్వర్ణలతో ఆధ్వర్యంలో ఆర్‌ఓఎఫ్‌ఆర్ గ్రామసభ నిర్వహించారు. అధికారులు సిద్ధం చేసిన రైతుల జాబితాను ఆ సభలో చదివి స్థానికుల అభ్యంతరాలను ఆర్డీఓ విన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసి అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత గ్రామసభలో వచ్చిన 27 అభ్యంతరాలపై రెవెన్యూ, సింగరేణి, అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. కానీ నేటికీ నిర్వాసిత జాబితాపై గ్రామసభ ఆమోదం పొందినట్లుగా ఏ ఒక్కరి సంతకం కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఎంజాయ్‌మెంట్ సర్వేతోనే పరిష్కారం..

ముందుగా అధికారులు నిర్ధారించిన 154 హెక్టార్ల భూ భాగంలో వాస్తవంగా సాగులో ఉన్న రైతులను గుర్తించేందుకు మరోసారి పకడ్బందీగా ఎంజాయ్‌మెంట్ సర్వే చేస్తే తప్ప భూనిర్వాసిత జాబితాపై వెల్లువెత్తుతున్న ఆరోపణలకు తెరపడేలా లేదు. రైతుల వద్ద ఉన్న డాక్యుమెంటేషన్, క్రయ విక్రయాలకు సంబంధించిన పత్రాలు సమగ్రంగా పరిశీలించి విక్రయించిన వారి వాంగ్మూలం సేకరించి సమగ్ర విచారణ చేపడితేనే అసలైన నిర్వాసితులు ఎవరో తెలుస్తుందని పలువురు అంటున్నారు.

'ముద్ర' గుడ్లు మాత్రమే తీసుకోవాలి


మాట్లాడుతున్న స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి సబిత, (ఇన్‌సెట్) గుడ్డుపై ప్రభుత్వ ముద్ర

స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి సబిత

పాల్వంచరూరల్: అంగన్‌వాడీ టీచర్లు ముద్ర కలిగి ఉన్న గుడ్లను మాత్రమే తీసుకోవాలని స్త్రీ,శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి సబిత ఆదేశించారు. మండల పరిధిలోని కోడిపుంజుల వాగు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసే గుడ్లు పక్కదారి పట్టకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ నెల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్లపై ప్రభుత్వ లోగో ముద్రించనున్నట్లు తెలిపారు. నెలలో మొదట పది రోజులు సరఫరా చేసే గుడ్లపై పికాకో బ్లూ కలర్ ముద్ర, రెండో పదిరోజులు సరఫరా చేసే గుడ్లపై రెడ్ కలర్, చివరి పది రోజుల్లో సరఫరా చేసే గుడ్లపై గ్రీన్‌కలర్ ముద్ర ఉంటుందని వివరించారు. గుడ్డు బరువు 45 గ్రాములనుంచి 52 గ్రాముల వరకు ఉంటుందని తెలిపారు. ప్రతి ట్రేలో రెండు, మూడు గుడ్ల బరువులను చూసిన తర్వాతనే తీసుకోవాలని ఆదేశించారు. ముద్రలేని గుడ్లను తీసుకోవద్దన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రిషన్ గార్డెన్ ఉండాలన్నారు. అంగన్‌వాడీ బడిబాటలో ఐదేళ్లు దాటిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని, రెండేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేరుకోవాలని సూచించారు. పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లల హాజరు శాతం పెంచాలని, లబ్ధిదారులను ఎన్‌హెచ్‌టీఎస్‌లో నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఈ నెల 2 నుంచి జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ, సూపర్‌వైజర్లు వసంతరాణి, అనసూర్య, వినో హసినా పాల్గొన్నారు.

జెడ్పీ ఛైర్మన్ రాజీనామా చేయాలని నిరసన


జెడ్పీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

చుంచుపల్లి: అధికార పార్టీ పదవుల్లో కొనసాగుతూ ప్రభుత్వంతోపాటు మంత్రి పువ్వాడపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తక్షణమే రాజీనామా చేయాలని కోరుతూ బుధవారం జెడ్పీ కార్యాలయం ముందు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీలో పదవులు పొంది పార్టీకి రాజీనామా చేయకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోరం కనకయ్య మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అందరి సహకారంతో జెడ్పీ చైర్మన్ పదవి దక్కించుకుని ఇప్పుడు రాష్ట్రమంత్రి పువ్వాడ అజయ్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. కోరం కనకయ్య ఆయన నమ్ముకుని తిరుగుతున్న వ్యక్తి పొంగులేటి ఇప్పటికైనా నోరు అదుపులో ఉంచుకోవాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ కనకయ్య దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు భీమా శ్రీధర్, రావి రాంబాబు, బండి రాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికను పరిశీలించిన జెడ్పీ సీఈఓ


రైతు వేదికలో సూచనలు చేస్తున్న సీఈఓ విద్యాలత

సుజాతనగర్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో సుజాతనగర్‌లోని రైతు వేదికను జెడ్పీ సీఈఓ ఎం.విద్యాలత పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి వసతులపై ఆరా తీసిన అనంతరం ఆమె మాట్లాడారు. ఈనెల 3వ తేదీన నిర్వహించే రైతు దినోత్సవంలో భాగంగా రైతులతో ర్యాలీ నిర్వహించాలని, భోజన వసతి కల్పించాలని సూచించారు. కాగా, మండలంలో దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై తహసీల్దార్ టి.సునీల్‌రెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఏఈఓలతో సమావేశమయ్యారు. ఈనెల 3న జరగనున్న రైతు దినోత్సవంపై సూచనలు చేశారు. ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఏఓ నర్మద, ఎంపీఓ ఖాజా మొహినుద్దీన్ ఖాన్ పాల్గొన్నారు.

నిధుల కేటాయింపునకు 'మున్సిపల్' ఆమోదం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సీతాలక్ష్మి, పక్కన ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో పలు పనులు చేపట్టేందుకు అవసరమైన నిధుల కేటాయింపునకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సిబ్బంది హాజరు నమోదుకు బయోమెట్రిక్ యంత్రాల కొనుగోలుకు రూ.లక్ష, ఓటర్ల దినోత్సవ నిర్వహణకు రూ.42 వేలు, గ్రంథాలయ ప్రహరీకి రూ.50లక్షలు, 36వ వార్డులో ఓపెన్ జిమ్ మరమ్మతుకు రూ.5లక్షలు, తాగునీటి సరఫరాకు రూ.2 లక్షలు, చైర్‌పర్సన్, కమిషనర్‌కు ఏడాదిపాటు వాహన సౌకర్యం కల్పించేందుకు రూ.7.92 లక్షలు, 33వ వార్డులో పార్కు అభివృద్ధికి రూ.10 లక్షలు, కమిషనర్ సెల్‌ఫోన్ బిల్లు, పన్నుల వసూళ్ల యంత్రాల మరమ్మతుకు రూ.2 లక్షలు, దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు రూ.15 లక్షలు కేటాయించడానికి బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించామని చెప్పారు. సమావేశంలో కమిషనర్ జి.రఘు, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

లారీని ఓవర్‌టేక్ చేయబోయి..

- ఆటోను ఢీకొట్టిన బైక్
- ఒకరు మృతి, మరో ఆరుగురికి తీవ్రగాయాలు

చర్ల: లారీని ఓవర్ టేక్ చేయబోయి ద్విచక్రవాహనం ఆటోను ఢీకొని ఒకరు మృతి చెందగా, మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దుమ్ముగూడెం మండలంలోని తూరుబాక సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పినపాక మండలంలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన కొందరు దుమ్ముగూడెం మండలంలోని చిననల్లబల్లిలో బంధువు అంత్యక్రియలకు బయల్దేరారు. భద్రాచలం నుంచి ఆటోలో వస్తుండగా అదే సమయంలో దుమ్ముగూడెం వైపు నుంచి భద్రాచలం వైపునకు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. బైక్‌పై వస్తున్న యువకుడు తూరుబాక సమీపంలో లారీని ఓవర్ టేక్ చేయబోయే క్రమంలో ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ పక్కన కూర్చున్న పాండురంగాపురానికి చెందిన సోయం శ్రీహరి(45) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా సర్పాపురం పీహెచ్‌సీకి అక్కడి నుంచి భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై దుమ్ముగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు.


ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

రామాలయంలో లడ్డూ టెండర్ ఖరారు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో భక్తుల కోసం తయారు చేసే లడ్డూ ప్రసాద టెండర్‌ను ఖరారు చేసినట్లు ఈఓ రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలానికి చెందిన లక్ష్మీగణపతి ఏజెన్సీస్ నిర్వాహకులు దేవాదాయ శాఖ నిర్దేశించిన రేట్లు, నియమ నిబంధనల మేరకు ఈ-టెండర్‌ను దక్కించుకున్నారని పేర్కొన్నారు. అనుమతి నిమిత్తం దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపినట్లు ఈఓ తెలిపారు.

రామయ్య సేవలో సినీ హాస్య నటుడు


ఉపాలయంలో పూజలు చేస్తున్న హాస్యనటుడు శ్రీనివాసరెడ్డి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ప్రముఖ సినీ హాస్య నటుడు శ్రీనివాసరెడ్డి దంపతులు బుధవారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు, శ్రీ అభయాంజనేయస్వామి ఉపాలయాల్లో స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు లారీలు, జేసీబీ పట్టివేత

పాల్వంచరూరల్: రాత్రి సమయంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు లారీలు, జేసీబీని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. మండల పరిధిలోని యానంబైల్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి అక్రమంగా మట్టిని తరలిస్తుండగా స్థానిక యువకులు అడ్డుకుని తహసీల్దార్ రంగాప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ హచ్య సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను పట్టుకున్నారు. రెండు లారీలు, జేసీబీని పోలీసులకు అప్పగించినట్లు ఆర్‌ఐ బుధవారం తెలిపారు.

లెక్క తప్పేదే లే...

- ఆన్‌లైన్‌లో నమోదు చేశాకే స్టాంపు పేపర్ల అమ్మకం
- వెండర్లతో అమలుచేయిస్తున్న అధికారులు
- 2వ తేదీ నుంచి మాన్యువల్ విక్రయాలకు అడ్డుకట్ట

ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపుల విక్రయాల్లో లెక్క తప్పకుండా ఆన్‌లైన్ ప్రక్రియ మొదలుపెట్టారు. ప్రతీ స్టాంప్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాకే విక్రయించాలన్న నిర్ణయంతో ఎలాంటి అవకతవకలు జరగవని.. ఇటు ప్రభుత్వం, అటు ప్రజలకు నష్టం ఉండదని చెబుతున్నారు. ఈమేరకు సబ్ రిజిస్ట్రార్ల వారీగా స్టాంప్ వెండర్లకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను రిజిస్ట్రేషన్ల శాఖ ఇప్పటికే కేటాయించింది. ఇక స్టాంప్ వెండర్లతో వారి వివరాలు, స్టాంప్ పేపర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారు.


2నుంచి ఆన్‌లైన్‌లోనే..

ప్రస్తుతం స్టాంప్ వెండర్ల వివరాలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. సబ్ రిజిస్ట్రార్లు స్టాంప్ వెండర్లతో స్టాక్ ఎంట్రీ చేయించాల్సి ఉంటుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 190 మంది స్టాంప్ వెండర్లు ఉండగా.. వీరిలో దాదాపు 150 మంది వరకు ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఇంకా మిగిలిన వారిలో పలువురికి ఆన్‌లైన్‌పై అవగాహన లేకపోగా అధికారులు ఆ దిశగా దృష్టి సారించారు. ఎట్టి పరిస్థితుల్లో 2వ తేదీ నుంచి స్టాంప్‌లను ఆన్‌లైన్‌లోనే విక్రయించాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదేశాలు జారీ చేసింది. మాన్యువల్‌గా అమ్మితే చెల్లవని అధికారులు వెల్లడించారు.

అక్రమాలకు తావు లేకుండా..

ఆన్‌లైన్ విక్రయాలతో ఎవరి దగ్గర ఎన్ని స్టాంప్‌లు ఉన్నాయి? వీటిలో ఎన్ని విక్రయించారనే వివరాలను ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించవచ్చు. అలాగే, కొనుగోలు చేసిన వివరాలు కూడా తెలిసిపోతాయని, వెండర్ల వద్ద స్టాక్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కానుండడంతో కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో విక్రయించేందుకు వీలు పడదు. అలాగే, ఎవరైనా అక్రమాలకు పాల్పడినప్పుడు ఎవరు అమ్మారు, ఎవరు కొనుగోలు చేశారనేది కూడా తెలిసిపోతుంది. అంతేకాక పాత డేట్లతో స్టాంప్ పేపర్లు అమ్మకం ఇక నుంచి వీలుకాదని, తద్వారా అక్రమాలకు చెక్ పడుతుందని చెబుతున్నారు.

అన్ని వివరాలు తెలుసుకోవచ్చు...



స్టాంప్ పేపర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి విక్రయించాలనే నిర్ణయం మంచిది. తద్వారా ఎవరు, ఎన్ని పేపర్లు విక్రయించారు, స్టాక్ ఎంత ఉందనేది తెలిసిపోతుంది. ఈనెల 2వ తేదీన ప్రతీ స్టాంప్ వెండర్ ఆన్‌లైన్‌లో నమోదు చేశాకే అమ్మాల్సి ఉంటుంది. అలాకాకుండా రిజిస్టర్లలో నమోదు చేసి అమ్మితే వాటిని పరిగణనలోకి తీసుకోం.

– చిట్టిమళ్ల అశోక్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ

పాతూరు గుట్టపై పురాతన విగ్రహాలు


పురాతన విగ్రహాల వద్ద పూజలు చేసిన దృశ్యం

గుండాల: ఆళ్లపల్లి మండలం పాతూరు గ్రామ సమీపంలోని బోడగుట్టపై పురాతన విగ్రహంతో పాటు బంగారు ఆభరణాలు బయల్పడ్డాయి. ఓ యువకుడి ద్వారా సమాచారం అందిన గ్రామస్తులు గుట్టపై వెతకగా ఓ గుహలో పురాతన శివలింగం, పుస్తెల తాడు, ముక్కుపుడక, రెండు వెండి కుంకుమ భరణిలు కనిపించాయి. దీంతో పూజలు ప్రారంభించారు. కాగా ఈ నెల 7న గుట్టపై జాతర నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు గొగ్గెల వసంతరావు, కల్తి నాగేశ్వరావు, శ్రీను, తదితరులు తెలిపారు.

గుజరాత్, మహారాష్ట్ర జట్ల విజయం

కొనసాగుతున్న ఆల్ ఇండియా మహిళా క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా మహిళా టీ-20 క్రికెట్ టోర్నీలో భాగంగా బుధవారం తమిళనాడు – గుజరాత్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తమిళనాడు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 18.2 ఓవర్లు ఆడి 102 పరుగులు చేయగలిగింది. జట్టులో మైథిలి 33 బంతులు ఎదుర్కొని 27, డ్యాన్సీ 19 పరుగులు చేయగా, గుజరాత్ బౌలర్లలో భవ్యమిత్ర నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 20 పరుగులకు నాలుగు వికెట్లు తీసుకుంది. అలాగే, కీర్తి, ఇటీషా పటేల్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన గుజరాత్ జట్టులో కృషి టక్కర్ 30, ఇటీషా పటేల్ 38 పరుగులు చేసి గెలిపించారు. మరో మ్యాచ్‌లో మహారాష్ట్ర – కర్ణాటక జట్లు తలపడగా టాస్ గెలిచిన కర్ణాటక జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 20 ఓవర్లలో 108 పరుగులు చేసింది. జట్టులో హాజిల్ 43 పరుగులు చేయగా, మహారాష్ట్ర బౌలర్లలో శ్వేత, ప్రసిద్ధి రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేసిన మహారాష్ట్ర జట్టు నిర్దేశిత లక్ష్యాన్ని 15.3 ఓవర్లలోనే అధిగమించింది. ఈ జట్టులో శ్వేత 39, అనిషా 28 పరుగులు చేశారు. కాగా, మ్యాచ్‌లను తెలంగాణ మహిళా టీ-20 క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ ప్రారంభించగా డబ్ల్యూటీసీ డైరెక్టర్ సందీప్ ఆర్య, మహిళా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.మతిన్, ఓలేటి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.